


ఇంకా పూర్తిగా తెల్లారకముందే బయట కుర్చీ వేసుకుని కూర్చున్నాడు కానిస్టేబుల్ సత్యం. పేపర్ కోసం కాదు! పేపరు తెచ్చే కుర్రాడి కోసం! అసలు సత్యానికి పేపరు చదివే అలవాటులేదు. "ఏ జాతి చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం... నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" అన్నట్టు ఏ రోజు పేపరు చూసినా ఏమున్నది గర్వకారణం... మన జాతి నైతిక పతనాన్ని మరోసారి చూపించే దర్పణం... అనేది ఈనాటి నిజం.

అక్కడ కులాల కురుక్షేత్రాలు, ఇక్కడ మతాల మారణహోమాలు - అక్కడ రాజకీయ హత్యలు, ఇక్కడ గ్రామ కక్షలు - అవినీతి, కుంభకోణాలతో కుళ్ళి పోతున్న రాజకీయాలు - లాకప్‌డెత్‌లు ఎన్‌కౌంటర్‌లు - యివన్నీ ప్రతి రోజూ చదవడం - ఆవేశం - ఆవేదన - ఆపై ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. ఆ నిస్సహాయ స్థితి లోనే సత్యంకి పేపరు చదవాలనే ఆసక్తి - చదివే శక్తి పోయాయి.

ఇప్పుడాయన కళ్ళు ఆత్రంగా ఎదురు చూస్తున్నది పేపరు తెచ్చే కుర్రాడి కోసం. తూర్పున అప్పుడే పైపైకి వస్తున్న బాలభానుడిలా వీధి చివర సైకిల్ మీద వస్తున్న చైతన్యని చూడగానే గబుక్కున కుర్చీలోంచి లేచి "సువర్చలా" ఇంట్లోకి కేక పెట్టాడాయన. ఆయన పిలుపు పూర్తికాకముందే వంటింట్లో వున్న సువర్చల పదడుగుల్లో వరండాలోకొచ్చింది. "వస్తున్నా నాన్నా?" ఆమె ప్రశ్నకి దూరంగా సైకిల్ మీద వస్తున్న చైతన్యని చేయెత్తి చూపించాడు సత్యం. సువర్చల ఒళ్ళంతా కళ్ళు చేసుకుని అంత దూరం నుంచే కొడుకుని ఆత్రుతగా, ఆప్యాయంగా తన చూపులతోనే తడుముతుండగానే చైతన్య దగ్గరికి వచ్చేసాడు. పక్కింటి ముందు ఆగి ఓ పేపరు వాళ్ళింట్లోకి విసిరాడు.

ఆ పక్కనే బొమ్మల్లా నిలబడి - చేష్టలుడిగిన వారిలా నిలబడి వున్న తల్లినీ, తాతనీ చూడనైనా చూడకుండా మళ్ళీ సైకిలెక్కాడు. అప్పటి వరకు మాటలు రాని దానిలా నిలబడి పోయిన సువర్చల కొడుకు తన ముందు నుంచే వెళ్ళిపోతుంటే ఒక్కసారిగా అప్పుడు తెరచింది నోరు - "ఒరే! బాబూ! చైతన్యా!" చైతన్య వెనక్కి తిరిగి తల్లి మొహంలోకి చూశాడు. "ఇంటికిరా నాన్నా!" "అమ్మా! అన్నం పెట్టు అని అడుక్కునే బిచ్చగత్తెలో కూడా వుండదు అంతటి దీనత్వం. పదమూడేళ్ళ చైతన్య కన్నతల్లి మొహంలో అంతటి దీనత్వం చూసి కూడా ఏ మాత్రం చలించలేదంటే - వాడి పట్టుదల ఎంతటిదో మరోసారి అర్థమైంది తల్లికీ, తాతకి! సూటిగా సత్యం మొహంలోకే చూస్తున్నాడు చైతన్య.

"రంగయ్య తాతని విడిపించుకురావడం తాతయ్య వల్ల కాదు నాన్నా! లేకపోతే నువ్వడిగితే కాదంటారా చెప్పు! నా మాటని ఇంటికి రారా" తల్లి మాటలు వింటున్నాడు కాని తాత మొహంలోకే చూస్తున్నాడు. అదే చూపు! నేరస్తుడిని న్యాయమూర్తి చూసే చూపు - తాతకళ్ళలోకి చూసి వెనకాల తల్లి మొత్తుకుంటున్నా వినిపించుకోకుండా ముందుకెళ్ళి పోయాడు చైతన్య.

అక్కడే గుమ్మంలోనే నిస్సహాయంగా చతికిల బడింది సువర్చల. రెండు కళ్ళలోంచి జారుతున్న కన్నీరు సమాంతర రేఖల్లా బుగ్గల మీంచి జారి పోతున్నాయి. కూతురి మొహంలోకి చూడలేక తలొంచుకున్నాడు సత్యం. పదేళ్ళ క్రితం - ఈలోకం విడిచివెళ్ళి పోయిన ఆమెభర్తని తను తెచ్చివ్వలేదు. కాని - కని పెంచిన కొడుకు కళ్ళముందే తిరుగుతున్నా తెచ్చివ్వలేక పోతున్నాడు తను! ఎలా?! ఎలా ఒప్పించాలి చైతన్యని. వాడి కోర్కె తీర్చలేని అసమర్థుడిగా తన్ను తాను ఎలా రుజువు చేసుకోవాలి? పది రోజుల క్రితం జరిగిన

సంఘటనలు పదే పదే ఆయన మనసులో మెదులు తున్నాయి.

ఆ రోజు సత్యం - మరో కానిస్టేబుల్ కలిసి అన్నం పళ్ళెం ముందు కూర్చున్న రంగయ్య తాతను లేపి చేతులకి సంకెళ్ళు వేశారు. వాళ్ళపై అధికారుల ఆజ్ఞ అది. అప్పుడు చైతన్య వాళ్ళింట్లోనే వున్నాడు. రంగయ్య తాత మనవడు కిట్టయ్య, చైతన్య స్కూల్లో స్నేహితులు. కిట్టయ్య భయంతో అలాగే బిగుసుకు పోయాడు గాని చైతన్య తనతాతని కదలనీయలేదు. "రంగయ్య తాత మంచోడు. ఆయన్నెందుకు పోలీస్ స్టేషన్‌కి తీస్కెళ్తు న్నావ్ తాతయ్యా!" కాళ్ళకడ్డం పడుతున్న మనవడి మీద ఆ సమయంలో కోపం వచ్చినా తమాయించు కున్నాడు సత్యం.

రంగయ్య తాతని అరెస్టు చేయడానికి కారణం, ఆ పసివాళ్ళ ముందుచెప్పలేక పోయాడాయన. కానీ "నేనేం చేశాను బాబూ!" అని మొత్తుకుంటున్న ఆ ముసలాడ్ని డొక్కలో పొడుస్తూ - బండ బూతులు తిడుతూ చెప్పాడు మరో కానిస్టేబుల్- "నిన్న సాయంత్రం ఆరింటికి నీ రిక్షాలో ఎక్కిన ఒకమ్మాయిని ఊరి చివర పార్కులోకి తీస్కెళ్ళి - ఆ అమ్మాయిని చంపి ఆమె ఒంటిమీదున్న నగలు కాజేసావ్..." అతని మాటలు పూర్తికావడం - చైతన్య "కాదు!" అంటూ అరవడం ఒకేసారి జరిగాయి. "కాదు! ఆ అమ్మాయి ఆరు దింటికే మా స్కూల్ ముందు దిగి పార్క్‌కి నడుచు కుంటూ వెళ్ళింది. రంగయ్య తాత నన్నూ, కిట్టయ్యనీ అప్పుడే స్కూల్ నుంచి ఇంటికి తీసుకొచ్చేశాడు. మళ్ళీ బయటికి పోలేదు. నేను ఏడింటిదాకా వానొస్తుందని ఇక్కడే వున్నాగా. కదా తాతయ్యా, నేను నిన్న ఏడింటికి రాలా ఇంటికి" సత్యం చేతులు పట్టుకుని ఊపుతూ అడుగు తున్నాడు చైతన్య.

సత్యం వాడ్ని బలవంతంగా పక్కకు తోసి "ఇంటికి పో" అంటూ ఒక్క కసరు కసిరి ముందుకి నడిచాడు గబగబా. కాళ్ళు ముందుకి నడుస్తున్నా - అడుగులు వెనక్కి పడుతున్నాయేమో నన్నంత అశక్తత ఆవరిం చింది ఒంట్లో. చైతన్య చెప్పిందాంట్లో పూర్తి నిజం వుంది. అది తనకు తెలుసు! తనకేనా? తనపై వాళ్ళకీ కూడా తెలుసు. కానీ... ఆ చనిపోయిన అమ్మాయి ఓ ఎమ్మెల్యే కొడుకు ప్రేమించిన అమ్మాయి. ఆ ఎమ్మెల్యే కొడుక్కి మరో మంత్రి కూతురితో పెళ్ళి జరగబో తోంది. ఆ అమ్మాయిని చంపించిందెవరో బయటకి రాకుండా రంగయ్య తాత శిక్ష అనుభవించాల్సిందే తప్పదు! రంగయ్య తాతని స్టేషన్‌కి తీసుకెళ్తూ - న్యాయదేవతకు సంకెళ్ళు వేసి తీసుకెళ్తున్నట్టు కంపిం చాడు సత్యం.

వెంటనే రంగయ్య తాత సంకెళ్ళు ఊడదీసి, అనాథగా మిగిలిపోయిన అతని మనవడు కిట్టయ్యకి "ఇదుగో నీ తాత" అంటూ అప్పజెప్పి వాడి మొహంలో వెలిగే కాంతుల్ని చూడాలనిపించింది. కానీ తను అశక్తుడు. రంగయ్య తాతకి చేతులకి మాత్రమే సంకెళ్ళు - తనకి ఒళ్ళంతా సంకెళ్ళే - ఖాకీ సంకెళ్ళు!

ఆ బాధ తాత్కాలిక మనుకున్నాడు సత్యం. కానీ చైతన్య ఇంట్లోంచి వెళ్ళి పోయి కిట్టయ్యతో పాటు వుంటూ దాన్ని పొడిగించాడు. సత్యం వెళ్ళి బతిమాలినా రాలేదు. "నువ్వు రంగయ్య తాతని తెచ్చి కిట్టయ్య కిస్తే. నేను నీ దగ్గర కొస్తా! లేపోతే రాను"- ఎన్నిసార్లు వెళ్ళినా యిదే మాట. వాడ్ని నాలుగు కొట్టి తను ఇంటికి తేగలడు. కానీ వాడడుగుతున్న ప్రశ్న విన్నాక సత్యం, తాతగా వాడిపై అధికారం చూపించలేక పోతున్నాడు. అతని ఆత్మసాక్షి అందుకు వ్యతిరేకిస్తోంది.

"నీకు తెలుసుకదా రంగయ్య తాత చంపలేదని! నువ్వు పోలీసువి కదా! మరి తాతని ఎందుకు విడిపించ లేవు?" ఈ ప్రశ్నకి సమాధానం చెప్పాల్సిన బాధ్యత తనపై వుంది కాబట్టే సత్యం చైతన్యని బలవంతంగా తీసుకెళ్ళ లేక పోతున్నాడు. ఓ పోలీస్‌గా వాడి ప్రశ్నకు సమాధానం చెప్పకాక, తాతయ్యగా వాడిని ఆప్యా



యతతో బుజ్జగించి తీస్కెళ్ళాలని చూశాడు. అదీ - ఇదీ - ఏదీ సాధ్యం కాలేదు. చైతన్య కిట్టయ్యతో వుండబట్టి పది రోజులయింది. స్కూల్ మానేశాడు. ఇద్దరిపొట్టలు గడవడానికి పేపర్లు వేస్తున్నాడు. ఇంకేం పన్లు చేస్తున్నాడో...!

మూసుకున్న కళ్ళలోంచి రెండు కన్నీటి బొట్లు రాలి ఒళ్ళో పెట్టుకున్న చేతులపై పడ్డాక స్పృహలోకొచ్చాడు సత్యం. కళ్ళు తెరిచి సువర్చల కోసం చూశాడు. లోపలుంది ఆమె. లేచి గబగబా డ్యూటీకి తయార య్యాడు. "అమ్మా, సువర్చలా! నేను స్టేషన్ కెళ్ళొ స్తాను. వచ్చేటప్పుడు చైతన్యని తీసుకొస్తాను." చాలా మామూలుగా,స్థిరంగా చెబుతున్న ఆయన మొహంలోకి ఆశ్చర్యంగా చూసింది సువర్చల. కూతురి కళ్ళలో ఆశ్చర్యాన్ని చూసి చిన్నగా నవ్వి "వెళ్ళొస్తానమ్మా" అంటూ బయటకి నడిచాడాయన. తండ్రి నవ్వు మామూలుగా లేదనిపించింది సువర్చలకి.

పన్నెండూ ఆ మధ్య చైతన్యనీ, కిట్టయ్యనీ చెరో చేత్తో పట్టుకుని తీసుకొస్తున్న తండ్రిని ఆశ్చర్యానందాల్తో చూస్తూ కొడుకుని అక్కున చేర్చుకుంటూ కిట్టయ్యని కూడా ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంది సువర్చల. పిల్లలిద్దర్నీ తీసుకెళ్ళి అన్నంపెట్టి వచ్చి తండ్రినడిగింది. "ఏం చెప్పారు నాన్నా చైతన్యకి" "ఇక చైతన్యకి జవాబు చెప్పాల్సిన బాధతప్పిందమ్మా నాకు" కుర్చీలో కూర్చుని టోపీతీసి తలని నిమురుకుంటూ అన్నాడాయన. "నాన్నా"- "అవునమ్మా ఉద్యోగానికి రిజైన్ చేశాను. ఇప్పుడు నా చేతిలో లేని పని చేయమని నన్నెలా అడగగలడు వాడు. కిట్టయ్యని మనింట్లోనే వుంచేసు కుందాం." భావరహితంగా కనబడుతోన్న తండ్రి మొహంలో ఏవో భావాలను వెదుక్కుంటోంది సువర్చల.

## ఒక పాత జ్ఞాపకం



పేరుకున్న నిశ్శబ్దం మంచుమీద
నునువెచ్చని వేళ్ల కదలిక
వందేళ్లుగా నిరగ పెరిగిన మొండి చెట్టు
తటాలున కూలినట్టు
ఒక్కసారి
మళ్లీ ఒక్కసారి
నీ ఇంట్లోకి

చీలిపోయిన జామచెట్టు కొమ్మల్లో
ఒక పక్షి
ఇప్పటికీ సూర్యోదయాన్ని నిరీక్షిస్తోంది
ఎండిన చేతుల్ని ఎగరేశాక కూడా
ఆ చెట్టు నీడ కింద
ఎర్రగా పండిన జాంపండు వాసనేస్తుందేమిటి?
ఇప్పుడు
పూగుతున్న నీ చంద్రబింబం
ఒలికిపోయిన పాలచుక్కలా -

ఏ రాతి నునుపు కళ్లకి గుచ్చుకున్నా
అక్కడ నీ తెగిన భుజం కనిపిస్తుందే,
ఆగిపోయిన మబ్బులతో
ఇప్పటికీ నేను నీకు
కబురంపుతుంటాను,
ఆగకుండా కురుస్తున్న వర్షధారల్లో
మనం వదిలేసిన
కాయితప్పడవ
ఎవరింటి ముందో వాలిపోయింది.
ఆ ఇంటికీ
ఆ పడవకీ లంగరందడం లేదు
దారం తెగిపోయాక
చీకట్లో దీపం వెతుక్కుంటూ
ఆ కనిపిస్తున్న దెవరు?
నేనే!

— అఫ్సర్